# అమరావతి రాజధాని పనుల పున: ప్రారంభం సందర్భంగా మే 2వ తేదీన విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి

# సిపిఎం బహిరంగ లేఖ

**శ్రీయుత నరేంద్ర మోడీ గారికి**
ప్రధానమంత్రి,
భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ.

**అయ్యా,**

ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని 2014 ఎన్నికలకు ముందు మీరు, ఎన్డీఏ పార్టీలు హామీ ఇచ్చారు. రాజధాని నిర్మాణానికి అయ్యే ఆర్థిక వనరులు సమకూర్చే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొనబడింది.

2014లో అమరావతి శంకుస్థాపనకి మీరు విచ్చేసిన సందర్భంలో భారీగా నిధులు ప్రకటిస్తారని ఆనాడు ప్రజలు ఆశించారు. కానీ చెంబుడు నీరు, గుప్పెడు మట్టితో సరిపెట్టి రాష్ట్ర ప్రజల ఆశలను నీరు కార్చారు.

సుమారు రూ. 50 వేల కోట్లు అవసరమని కోరినా, గత 11 సంవత్సరాల కాలంలో రూ. 1500 కోట్లు మాత్రమే రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించింది.

గత రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని నీరుగార్చి, మూడు రాజధానుల పేరుతో వివాదాన్ని సృష్టించినా మీరు నోరు విప్పలేదు. కేంద్రం జోక్యం చేసుకోలేదు. హైకోర్టులో రాజధాని నిర్మాణానికి కేంద్రానికి సంబంధం లేదని అఫిడవిట్ దాఖలు చేశారు.

41 కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు అమరావతిలో స్థలాలు కేటాయించినా, ఇప్పటివరకు అత్యధిక కార్యాలయాలు పనులు కూడా ప్రారంభించలేదు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను మిగిల్చారు.

2014 సంవత్సరంలో రాష్ట్రంలో టిడిపి, బిజెపి ప్రభుత్వం రూపొందించిన పూలింగ్ చట్టం నేటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. రైతులు, కూలీలు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. చట్టబద్ధమైన హామీలు అమలు కోసం, అమరావతి పరిరక్షణ కోసం పోరాడిన వారిపై పెట్టిన కేసులు ఈ నాటికి రద్దు చేయలేదు.

కేంద్రంలో మూడోసారి మళ్లీ మీరు అధికారంలోకి వచ్చారు. రాష్ట్రంలో మీరు భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కనీసం ఇప్పుడైనా రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేస్తారని ప్రజలు ఆశించారు.

అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, హడ్కో తదితర సంస్థల ద్వారా రూ. 31 వేల కోట్లు అప్పులు మంజూరు చేయించే ప్రకటనలకే పరిమితమయ్యారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 1400 కోట్లు మాత్రమే గ్రాంటు ఇస్తుందని ప్రకటించారు. మళ్లీ అప్పులు, వడ్డీలతో సహా రాష్ట్ర ప్రజలే చెల్లించాలి. భవిష్యత్తులో ఇది భారంగా మారుతుంది.

అమరావతి నిర్మాణానికి లక్ష కోట్ల రూపాయలు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మే రెండో తేదీ ప్రారంభ కార్యక్రమం సందర్భంగా విచ్చేస్తున్న మీరు అప్పులు కాకుండా స్పష్టంగా గ్రాంట్లు ఇస్తూ ప్రకటన చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆరు నెలల కాలంలో కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాలు పూర్తి చేయడానికి నిర్దిష్ట చర్యలు ప్రకటించాలి.

రాజధాని అమరావతితో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయంలో స్పష్టమైన ప్రకటన చేయాలి. విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు ఏర్పాటు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు పైన మీరు స్పందించాలి.

రాష్ట్రం, రాజధాని అభివృద్ధిలో 10 సంవత్సరాలు పైగా విలువైన సమయం కోల్పోయాం. తక్షణమే నిధులు కేటాయించాలి. వేగంగా పనులు జరగాలి. రాజధాని అమరావతి, రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందాలి. కనీసం ఈసారైనా నిధులు, అభివృద్ధికి అవసరమైన స్పష్టమైన చర్యలతో రాష్ట్ర ప్రజలు ఆశించిన రీతిలో మీరు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

25 ఏప్రిల్, 2025

**అభివందనములతో...**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
**ఆంధ్రప్రదేశ్ కమిటీ**